క్లుప్తంగా

మేఘనాథంకు నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి సోదరులు

నగరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దేశమ్మ ఆలయ కమిటీ మాజీ డైరెక్టర్ ఎ.మేఘనాథం శుక్రవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలిసి మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి శనివారం నగరిలోని మేఘనాథం నివాసానికి చేరుకున్న మృతదేహంపై పూలదండలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరఫున అండగా ఉంటామన్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, కౌన్సిలర్ రమేష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఆనంద్ కుమార్, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కృపాలక్ష్మిని గెలిపించండి



జీడీనెల్లూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కృపాలక్ష్మిని, చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి రెడ్డెప్పను అత్యధిక మెజారిటీతో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర గ్రీనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి అన్నారు. గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులతో కలిసి భారీ ఎత్తున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పూర్ణచంద్రారెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, స్థానిక సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్, ఢిల్లీ, మోహన్, జగదీష్, మదన్, బాబు, మహిళలు పాల్గొన్నారు.

థామస్ తాయిలాలు



థామస్ పంపిణీ చేసిన ఫ్లాస్క్

పాలసముద్రం: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారు. అలాకాకుండా చెన్నైలో ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చిన వారి దోచుకున్న డబ్బులతో ఫ్లాస్క్, డబ్బులు పంపిణీ చేస్తున్నారు. పాలసముద్రం మండలం ఆముదాల పంచాయతీలో ఆముదాల దళితవాడకు తప్ప అన్ని రాత్రిలో ప్రతి ఇంటికీ సుమారు రూ.150 విలువజేసే ఫ్లాస్క్ పంపిణీ చేయడంపై ఓటర్లు మండిపడుతున్నారు.

జగనన్నతోనే గ్రామాల అభివృద్ధి



రామకృష్ణాపురంలో ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ హేమలత రెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): జగనన్నతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, తిరిగి ఆయన్ని సీఎంను చేద్దామని పెనుమూరు ఎంపీపీ మహాసముద్రం హేమలత రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు దయాసాగర రెడ్డి ఆధ్వర్యంలో 12 గ్రామ సచివాలయాల్లో ఆయా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, మాజీ కన్వీనర్ సురేష్‌రెడ్డితో కలిసి రామకృష్ణాపురం, కత్తిరెడ్డిపల్లె గ్రామ సచివాలయాల పరిధిలో పర్యటించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, ఏఎంసీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గోవిందరెడ్డి, రామకృష్ణాపురం సర్పంచ్ వెంకటేశులు, చింతపెంట ఎంపీటీసీ సభ్యులు సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, హరికృష్ణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



పవన్ మృతదేహం

శ్రీరంగరాజపురం: మండలంలోని పాదలపల్లికి చెందిన నాగరాజు కుమారుడు పవన్(24) శనివారం రాత్రి సొంత పనుల నిమిత్తం బైక్‌లో పళ్లిపట్టుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలోని క్షీరసముద్రం వద్ద ఇదే గ్రామానికి చెందిన జగదీశ్వర్‌నాయుడు బైక్‌లో రోడ్డు క్రాస్ చేస్తుండగా ఇద్దరి బైక్‌లు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజకుల్లాయప్ప సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని, గాయపడిన జగదీశ్వర్ నాయుడిని చిత్తూరు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి ఏడాది కిందట వివాహమైంది. ప్రస్తుతం అతని భార్య గర్భిణి అని గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నాం





మంచంపై ఉన్న వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి రోజా, ఎన్నికల ప్రచారంలో మంత్రి ఆర్‌కే రోజా

- ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా మమ్మల్ని ఓడించలేరు
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల గుండెల్లో కట్టుకున్న కంచుకోటని మంత్రి ఆర్కేరోజా అన్నారు. శనివారం నగరి రూరల్ మండలం దేశూరు అగరం, నంబాకం, చిన్నలూరు గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఆమెను ఉప్పొంగిన అభిమానంతో ఆహ్వానించారు. హత్తుకుంటూ తమ ఆప్యాయతను కురిపించారు. ప్రచారంలో ఆమెతో పాటు జతకట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లిన మంత్రి అవ్వా బాగున్నావా, తాతా బాగున్నావా, అక్కా ఎలా ఉన్నావు అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ వారితో కలిసిపోయారు. ఓటు వేసి తనను గెలిపించినందుకు నియోజకవర్గంలో ఇన్ని అభివృద్ధి పనులు చేయగలిగానంటూ చిత్రపటాల సాక్ష్యాలతో వారికి బాధ్యతాయుతంగా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగనన్న ప్రజల గుండెల్లో కట్టిన కంచుకోటన్నారు. ఎంతమంది కలుసుకుని గుంపులుగా వచ్చినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎవరూ ఏం చెయ్యలేరన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ వైస్ ఛాన్స్‌లర్ పద్మావతి యూనిర్సిటీ డి.జమున, ఎంపీపీ భార్గవి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల అధ్యక్షుడు సుదర్శన నాయుడు, మండల సచివాలయ కన్వీనర్ దామోదర్‌రెడ్డి, గోపాల్‌రాజు, సుధాకర్ రెడ్డి, శ్రీహరి, పరంధామరెడ్డి, పి.లక్ష్మీనారాయణ, రంగనాథం, ఏలుమలై రెడ్డి, రామ్మూర్తి రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.



పుత్తూరులో..

పిల్లల భవిష్యత్ కోసం జగనన్నకు ఓటేద్దాం

పుత్తూరు: మన పిల్లల భవిష్యత్ బాగుండాలంటే జగనన్నకు ఓటెద్దామని మంత్రి, వైఎస్సార్‌సీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. శనివారం వడమాలపేట మండలం అప్పలాయగుంట పంచాయతీ పరిధిలోని యనమలపాళెం, తిరుమణ్యం గ్రామాల్లో మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇంటింట కర్పూర హారతులిస్తూ స్వాగతం పలికారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాలు కలిగిన కరపత్రాలను అందజేసి ఓట్లు అభ్యర్థించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ఎంత బలంగా ఉందో చంద్రబాబుకు తెలుసునని, అందుకే జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకోవడం జరిగిందన్నారు. అంతర్గతంగా కాంగ్రెస్‌తోనూ లాలూచీ పడ్డాడని ఆరోపించారు. జగనన్న వెంటే ప్రజలు ఉన్నార‌ తెలిపారు. నగరి నుంచి తనను ముచ్చటగా మూడవసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల ఆర్భాటాలు

గంగాధరనెల్లూరు: మండలంలోని ఎట్టేరి గ్రామంలో శనివారం టీడీపీ, జనసేన నేతల ఎన్నికల ప్రచారం విమర్శలకు దారి తీసింది. చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై బాణసంచాలు కాలుస్తూ డప్పుల వాయిస్తూ వాహనాలను రోడ్డుపై నిలిపారు. దీంతో చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు. అలాగే కార్వేటినగరంలోని ఆర్కేవీబీపేట పంచాయతీ కార్యాలయం ఎదురుగా తెలుగు తమ్ముళ్లు ప్రజలను ఇబ్బందులకు గురి చేశారు. ఆర్కేవీబీపేట ఇందిరా కాలనీకి చెందిన టీటీడీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి రంజిత్ కుమార్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్నాడు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరారు.



టీడీపీ అభ్యర్థి థామస్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్న టీటీడీ ఉద్యోగి రంజిత్

నేడు, రేపు పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి

నగరి: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది, అత్యవసర శాఖలో పనిచేసే ఉద్యోగులు, వీడియోగ్రాఫర్లు, డ్రైవర్లు వారి ఓటు హక్కును నేడు, రేపు వినియోగించుకోవచ్చని ఎన్నికల అధికారి తెలిపారు. శనివారం ఎన్నికల అభ్యర్థులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెసిలిటేషన్ కేంద్రం పుత్తూరు జెడ్పీ ఉన్నత(బాలికలు) పాఠశాల, పుత్తూరులో ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు విధిగా ఓటరు కార్డు), ఆధార్ కార్డు ఇతర గుర్తింపు కార్డులు గానీ, ఉత్తర్వుల కాపీలను తీసుకెళ్లాలన్నారు.

జగనన్నతోనే బంగారు భవిష్యత్

పాలసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు వచ్చిందని సింగిల్‌విండో చైర్మన్ గాలి జ్యోతి, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసి యాదవ్ తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురం పంచాయతీ సర్పంచ్ గాలి మహేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ పార్టీ కార్యకర్తలతో కలసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందరాజ్, చంద్రశేఖర్ రాజు, షణ్ముగరెడ్డి, ప్రేమ్‌కుమార్, గోపాల్, మునిరత్నం, శరవణన్, సుబ్రమణ్యం, వడివేలురెడ్డి, ధనుంజయులు పాల్గొన్నారు.

పెత్తందారులను తరిమేద్దాం



వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరుతున్న డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే అభ్యర్థి

- సంక్షేమ ప్రభుత్వాన్ని సాధించుకుందాం
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: ''పేదల వైపు జగనన్న అండగా ఉంటే పెత్తందారుల వైపు చంద్రబాబు, పవన్, లోకేష్, ఎల్లో మీడియా, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అండగా ఉన్నాయి.. అందుకే పెత్తందారులను సాగనంపి, మరోమారు సంక్షేమ ప్రభుత్వం సాధించుకుందాం'' అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శనివారం మండలంలోని చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి స్వగ్రామం 49 కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీగా రెడ్డెప్ప, ఎమ్మెల్యేగా కృపాలక్ష్మిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మాట్లాడుతూ భవిష్యత్‌లో సీఎం జగనన్న సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం కోటార్లపల్లి వద్ద డిప్యూటీ సీఎం నారాయణస్వామి, చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సహకారంతో స్మార్ట్ డీవీ పరిశ్రమను స్థాపించడం జరిగిందన్నారు. మన ప్రభుత్వం రాగానే ఇంటి పట్టాలపై కోర్టులో ఉన్న కేసులను వెకేట్ చేయించి అర్హులకు పట్టాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

49 కొత్తపల్లిమిట్టలో హోరెత్తిన ప్రచారం

49 కొత్తపల్లిమిట్ట గ్రామంలో స్థానిక సర్పంచ్ డిల్లయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం హోరెత్తింది. బాణసంచా పేలుళ్లు, జై జగన్ నినాదాలు మిన్నంటాయి. ముందుగా ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మికి క్రేన్ ద్వారా గజమాల వేసి పూలవర్షం కురిపించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మణి, ఎంపీటీసీ సభ్యులు సుజాత, జెడ్పీటీసీ రమణ ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు విజయబాబు, మాజీ ఎంపీపీ మోహన్, నాయకులు దేవరాజులురెడ్డి, ఏసురత్నం, యుగంధర్ రెడ్డి, కోటిరెడ్డి బాబు, జయవేలురెడ్డి, శ్యామ్, గోవిందరెడ్డి, సీకే బాబు, సుధ, భాస్కర్, విజయ్‌కుమార్, ఉమాపతి, శరత్, విష్ణు, అబుర్, శేషు పాల్గొన్నారు.



గంగమాంబపురంలో కృపాలక్ష్మికి సన్మానం

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించి వారి ప్రగతికి బాటలు వేశారని ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిధిలోని ముక్కరవానిపల్లి పంచాయతీలో ఎంపీపీ లత, సర్పంచ్ గుణవతితో కలసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా రెడ్డెప్పను గెలిపించాలని కోరారు. ఈ క్రమంలో భాగంగా దాసరినత్తంలో ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన కృపాలక్ష్మిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పట్టాభిరెడ్డి గజమాలతో ఘనంగా సన్మానించారు. అలాగే ఎంపీపీ లతను సర్పంచ్ గుణవతి, లోకనాథంనాయుడు దంపతులు శాలువలు కప్పి గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మా ఆడబిడ్డను ఆశీర్వదించండి

నగరి: మా ఆడపడుచును ఆశీర్వదించండి అంటూ మంత్రి ఆర్‌కే రోజా వదినలు లక్ష్మి, సుమతి, రుఘాన్సీ, సరస్వతి, అక్క లావణ్య మున్సిపల్ పరిధిలోని సత్రవాడలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. స్థానికులు వారికి అపూర్వ స్వాగతం పలుకగా ఉత్సాహంగా వారు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, నాయకులు కన్నాయిరం, అయ్యప్ప, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రోజమ్మ గెలుపును కాంక్షిస్తూ..

విజయపురం: మండలంలోని మాధవరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం స్వచ్ఛందంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మంత్రి ఆర్కే రోజాను గెలిపించాలంటూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందిస్తూ, జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. నగరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన మంత్రి ఆర్‌కే రోజాను ముచ్చటగా మూడవసారి గెలిపించుకుందామని, అంతవరకు అంతా కష్టపడి పని చేస్తామని తెలిపారు. ప్రచారంలో మాధవరం నాగరాజు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

సంక్షేమం కొనసాగాలంటే జగనన్న రావాలి



నింద్ర: ప్రచారం నిర్వహిస్తున్న మధుసూదన్ రెడ్డి

నింద్ర: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోమారు సీఎంను చేసుకోవాలని నగరి నియోజకవర్గ పరిశీలకులు చిందేపల్లి మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని బీసీ కాలనీలో 'మేము సిద్ధం– మా బూత్ సిద్ధం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి నగరిలో రోజమ్మను గెలిపించాలని కోరారు. అదే విధంగా హరిజనవాడలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి శ్యామ్ లాల్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభ, సర్పంచ్ బాబురెడ్డి, నాయకులు రేవతి, మేరి, నాయకులు శివలింగ ఆచారి, శివలింగారెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, సురేష్, దొరబాబు పాల్గొన్నారు.

గాలివానకు రైతన్నకు తీరని నష్టం



పిడుగుపాటుకు మృతి చెందిన పాడి ఆవులు, నేల రాలిన మామిడి, గాలులకు విద్యుత్ తీగలపై పడిన చెట్లు

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలంలో శనివారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. ఉగ్రాణంపల్లి, జిట్టిగుండ్లపల్లె, సాతంబాకం, మఠంపల్లె, కలవగుంట, పులికల్లు, ఎలుంగుండ్లపల్లి ప్రాంతాల్లో భారీవర్షం కురిసింది. పెద్దఎత్తున మామిడి కాయలు రాలిపోయింది. కోతదశకు వచ్చిన వరిపంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. చిన్నమరెడ్డికండ్రిగ ఆది ఆంధ్రవాడలో జ్యోతీశ్వర్‌కు చెందిన రెండు పాడి ఆవులు, రామకృష్ణపాడి ఆవు పిడుగు పాటుకు మృతి చెందాయి. సుమారు రూ.1.80 లక్షల వరకు నష్టం వాటిల్లింది. అలాగే అదే గ్రామంలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పిడుగుపాటుకు పేలిపోయాయి. అదేవిధంగా రామ్మూర్తి యాదవు ఇంటిలో ఫ్రిడ్జ్, టీవీ కాలిపోయాయి. పరిసర గ్రామాల్లో విద్యుత్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వడగండ్ల వానకు తీరని నష్టం

వెదురుకుప్పం: మండలంలో శనివారం మధ్యాహ్నం వడగండ్ల వాన పడింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కొండకిందపల్లెలోని రేణుకకు చెందిన పాడి ఆవు పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో తనకు రూ.వేల మేర నష్టం వాటిల్లిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

అకాల వర్షానికి నేల రాలిన మామిడి

గంగాధర నెల్లూరు: మండలంలో కురిసిన అకాల వర్షానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలాగే చెరుకు, వరి పంటలతో పాటు మామిడి పిందెలు నేల రాలాయి. మామిడి రైతులకు నష్టం వాటిల్లింది. మామిడి పిందెలు నేల రాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగి పడడంతో బాలగంగనపల్లిలో అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు.

వైద్యసేవలు బాగున్నాయి



అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ ప్రభావతి

విజయపురం: విజయపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు ఆస్పత్రికి సంబంధించిన రికార్డుల నిర్వహణకు బాగుందని జిల్లా డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ప్రభావతి అభినందించారు. శనివారం ఆమె విజయపురం పీహెచ్‌సీని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని వసతులు ఉన్నాయని, అత్యాధునికమైన పరికరాలతో పాటు 64 రకాల పరీక్షలు చేస్తారని ఆమె తెలిపారు. అంతేకాకుండా గర్భిణులకు అవసరమైన మందులు, మాత్రలతో పాటు సరైన సమయంలో అవగాహనతో పాటు సలహాలు ఇస్తున్నాయని వివరించారు. ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందుతున్నాయని తెలిపారు. అందులో విజయపురం ఓ మారుమూల ప్రాంతమైనా కూడా వైద్యసేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది పనితీరు బాగుందన్నారు. ఆమె వెంట డాక్టర్ వాణి, డీఈఎంఓ జయరామన్, డాక్టర్ సోమశేఖర్, విష్ణుప్రియ, సిబ్బంది ఉన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్త పడాలి

నగరి: ఎండతీవ్రత ఎక్కువగా ఉందని జాగ్రత్తతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధి సత్రవాడలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, వైద్యాధికారి ఇళరసన్ పాల్గొన్నారు.